క్లుప్తంగా

జాతీయ మహాసభలను విజయవంతం చేయండి



మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్) : తిరుపతిలో ఈనెల 16,17,18 తేదీల్లో నిర్వహించే ఐఎఫ్‌టియూ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను నిరాస పరుస్తున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బుద్దా వెంకటరావు, నాయకులు జగ్గపు రమణ, మంగం అప్పారావు,డి.వీరినాయుడు, నౌడు నెహ్రూబాబు, బి.వీరభద్రం, సందక అప్పారావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు

కొయ్యలగూడెం : పేదలకు మరింత మెరుగైన వైద్యం అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రూపొందించిందని బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జోష్టదేవి పేర్కొన్నారు. గంగవరం గ్రామంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనాన్ని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలలోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తరచూ హాస్పిటల్స్‌కి వచ్చే శ్రమ తగ్గుతుందని నేరుగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి వైద్యం అందిస్తారన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీలకు, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్యసేవలు అందుతాయన్నారు. పార్టీ నాయకులు కంచర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య, సచివాలయ కన్వీనర్ కుర్రు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. టి.వీర్రాజు అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై బుట్టాయగూడెం వైపు నుంచి జంగారెడ్డిగూడెం వస్తుండగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో వీర్రాజుకు కాలికి తీవ్ర గాయమైంది. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద చికిత్స చేశారు.

పండగలా 'జగనన్నే మా భవిష్యత్తు'

- ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన
- ఏలూరులో జోరుగా సాగుతున్న వైనం



ఏలూరు 16వ డివిజన్‌లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల తదితరులు



కోటేశ్వరదుర్గాపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ శ్రేణులు

ఏలూరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న ‹జగనన్నే మా భవిష్యత్తు› కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. జగనన్న నువ్వే మా నమ్మకం అంటూ సచివాలయ కన్వీనర్లు , గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి గడపకూ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో మీరు ఏవిధమైన లబ్ధి పొందారు... గతంలో ఇలాంటి సంక్షేమ పథకాలు టీడీపీ హయాంలో అందాయా ? అంటూ మహిళలకు, లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. పథకాలతో మేలు జరిగిన కుటుంబాల యజమానుల అనుమతితో వారి ఇంటికి సీఎం జగన్ చిత్రపటంతో కూడిన స్టిక్కర్లను, మొబైల్ ఫోన్లపై స్టిక్కర్లను అంటిస్తున్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న

ఏలూరు వన్‌టౌన్ 16వ డివిజన్ కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల ఆధ్వర్యంలో శనివారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఏలూరు మాజీ కార్పొరేటర్ బండారు కిరణ్‌కుమార్, సచివాలయ కన్వీనర్ల జోన్-1 ఇన్‌ఛార్జ్ మోటమర్రి సదానందం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సొమ్ము జమ చేశారని తెలిపారు.

మహిళల అభివృద్ధే లక్ష్యం

ఏలూరు 49వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గత టీడీపీ హయాంలో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధుల సిఫార్సు ఉంటే తప్ప ఏ పథకమూ లభించే పరిస్థితి లేదనీ, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు చేస్తుందని గుర్తు చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఏలాంటి పరిస్థితులు ఉండేవి, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏలా ఉంది అనే కొన్ని ప్రశ్నలతో కూడిన సర్వేను పూర్తి చేశారు.

ప్రజల వద్దకే పాలన

ఏలూరు 2వ డివిజన్ కార్పొరేటర్ జున్నూరు నరసింహారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? మీరు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారా అంటూ ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి అందించిన బుక్‌లెట్‌ను వారికి అందిస్తూ వాస్తవ పరిస్థితులను వివరించారు. సచివాలయ కన్వీనర్ల జోన్-1 ఇన్‌చార్జ్ మోటమర్రి సదానందం, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలోనూ సంక్షేమం :

ఏలూరు 50వ డివిజన్‌లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ మానుకొండ శ్రీను, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనతో మీరు సంతృప్తి చెందుతున్నారా ? అంటూ మహిళలను, గృహ యజమానులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల అనుమతితో ఇంటి గోడలకు, గుమ్మాలకు, మొబైల్ ఫోన్లకు స్టిక్కర్లను అతికించారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన కరపత్రాన్ని వారికి చదివి వినిపించారు.

పేదల సంక్షేమమే జగన్ ధ్యేయం

ఏలూరు రూరల్: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయం అని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఏలూరు మండల కోటేశ్వరదుర్గాపురం, కొక్కిరాయిలంక గ్రామాల్లో ‹మా నమ్మకం నువ్వే జగన్› కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు వర్రీ లక్ష్మీదుర్గ, తోకల అమల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారు ఉన్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ పథకాలు అమలు చేయడం వల్ల మా కుటుంబాలు బాగుపడ్డాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, మండల కన్వీనర్ గుర్రం శివ, బాపనయ్యతో పాటు ఉపసర్పంచ్ ఇంటి భూషణరాజు, కొర్రిపల్లి ధనలక్ష్మి, బోడిగడ్డ శ్రీను, పరుశురాం, బాలకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

చొదిమెళ్లలో వరిచేనుకు తెగుళ్లు



దొండపాడు ఆయకట్టు కింద తెగులు సోకిన పంట పరిశీలిస్తున్న శ్రీనివాస్

ఏలూరు రూరల్: చొదిమెళ్లలో వరి పంటకు అంతుబట్టని తెగులు సోకి ఓ రైతు నష్టపోయాడని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన దొండపాడు చెరువు ఆయకట్టు కింద తెగులు సోకిన పంటచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంబశివరాజు అనే రైతు రూ 2 లక్షల 50 వేలు పెట్టుబడి పెట్టి, 8 ఎకరాల్లో వరిసాగు చేపట్టారన్నారు. ఇటీవల వచ్చిన అకాల వర్షాల కారణంగా ఈలిక దశకు వచ్చిన పంటకు గింజ తయారు కావడం లేదన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు వెంటనే క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టి తెగులు నిర్ధారించాలన్నారు. అధికారులు స్పందించి నష్టపోయిన రైతును ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అయన వెంట వాడవల్లి కొండప్ప, స్వామి, మణికంఠ, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జగనన్న కాలనీలో జోరుగా నిర్మాణాలు



శనివారపుపేట జగనన్నకాలనీలో నిర్మించుకున్న సొంతిల్లు

ఏలూరు రూరల్: పేదలకు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరింది. ఇప్పటి వరకూ అద్దె ఇంటిలోనే కాలం వెళ్లదీసిన వారికి జగనన్న సొంతిల్లు సమకూర్చి ఆదుకున్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అర్హులందరికీ స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రుణాలు మంజూరు చేసి వారిలో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. కాయకష్టం చేసుకొని జీవించే మమ్మల్ని జగనన్న ఆదుకున్నాడంటూ లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీపై అందించిన ఇనుము, ఇసుక, సిమెంట్ తీసుకొని ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయానికి మరింత సొమ్ము జోడించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నారు. ఆయా నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. కొంత మంది తమ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. కాలనీల్లో నీరు, కరెంటు సదుపాయం, బోర్‌వెల్స్ ఏర్పాటు, పైపులైన్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్నారు.

జగనన్నే మాకు దేవుడు



ఏలూరు శనివారపుపేట ఇందిరాకాలనీలో ప్రభుత్వం నిర్మించిన జగనన్నకాలనీలో ఎం నాగేశ్వరమ్మ అనే గృహిణి సొంతింటిలో పిల్లాపాపలతో సంతోషంగా జీవిస్తోంది. రెండేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడడంతో వలంటీర్లు ఆమె ఇంటికి వచ్చి స్థలం మంజూరయ్యిందనే తీపి కబురు చెప్పారు. దేవుడే జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో కనికరించాడంటూ సంబరపడ్డారు. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వెంటనే ప్రభుత్వం 2.10లక్షలు మంజూరు చేసింది. వెనువెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాం. ఆరు నెలల్లో ఇళ్లు కుట్టుకున్నాం. ఈ సందర్భంగా ముఖ్యమంతమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

– నాగేశ్వరమ్మ, ఏలూరు నగరం

సంతోషంగా ఉన్నాం



ముఖ్యమంత్రి జగనన్న దయ వల్ల సొంతిల్లు నిర్మించుకొని సంతోషంగా ఉంటున్నాం. 36ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉన్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థలం మంజూరు చేయడంతో మేము కష్టపడి ఇళ్లు కట్టుకొని సొంతింట్లో ఉంటున్నాం. ప్రభుత్వం ఇచ్చిన నగదుతో పాటు మరికొంత డబ్బు జతచేసి ఇళ్లు కట్టుకున్నారు. కొద్దిరోజుల క్రితం గృహ ప్రవేశం చేశారు. పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నారు. ఏ నాయకుడు వచ్చిన ఏ ప్రభుత్వం గెలిచిన ఇంతకంటే ఏమీ చేయగలడంటూ ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

– స్వరాజ్యలక్ష్మి, ఏలూరు నగరం

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	22	చామదుంపలు	68
వంకాయలు (తెలుపు)	24	ముల్లక్కాడలు	08-10
బెండకాయలు	20	కంద	46
పచ్చిమిర్చి	42	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-34	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	56	అల్లం	120
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	60
అనబకాయ (1)	15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	04
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	07
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	01
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	31
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	22.00	98516	36
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.10	98503	23
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

ఘనంగా కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవాలు



నగరంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 42వ డివిజన్‌లో వేంచేసియున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం సప్తమ వార్షికోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు స్వామి వారికి పంచామృత అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు స్వామి వారి శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం 4 గంటలకు స్వామి వారి నగరోత్సవం విశేషంగా అలంకరించిన ప్రత్యేక రథంపై నగర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా దారి పొడవునా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాత్రి 7 గంటల నుంచి స్వామి వారి పవళింపు సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం అర్చకులు కోట సత్య ప్రకాశాచార్యులు విశేష పూజలు నిర్వహించగా, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు మానవ శరీరంలో రక్తకణాల ప్రాముఖ్యతపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ హిమోఫీలియా దినోత్సవం సందర్భంగా మానవ శరీరంలో రక్తం ప్రాముఖ్యత, రక్తకణాల పెరుగుదల అనే అంశాలపై ఈ నెల 9వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు హిమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ నిళిని పార్థసారధి ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. మహిళలను, యువకులను ప్రధాన భాగస్వామ్యం చేస్తూ రక్తం, రక్త కణాల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

మోడీని గద్దె దింపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై పోరాటానికి ప్రజల మద్దతు కూడగట్టడానికి ఈనెల 14నుంచి 30వరకు ప్రచార జాత నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అదానీ, అంబానీ కోసం ప్రధాని ప్రభుత్వ రంగ సంస్థలను ఇచ్చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలు వెల్లడిస్తున్న సంస్థలు, విపక్ష నేతలు, ప్రశ్నించే గొంతుకలపై దాడి చేయడం ఈడీ, సీబీఐని ఉపయోగించడం మోదీ దాష్టీకానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, నాయకులు ఎండీ మునీర్, ఉప్పులూరి హేమశంకర్, బత్తుల వెంకటేశ్వరరావు, సన్నేపల్లి సాయిబాబా, కంచర్ల గురవయ్య, బాడిస రాము, కారం దారయ్య, భజంత్రీ శ్రీనివాసరావు, మావూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

నిఘంటువులు వచ్చేశాయ్

విద్యా కానుక కిట్ల పంపిణీకి చర్యలు



ఏలూరు జిల్లా ఎస్ఎస్ఏ సీఎంఓ సమక్షంలో నిఘంటువులను దిగుమతి చేసుకుంటున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జగనన్న విద్యాకానుకలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి చదివే విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన నిఘంటువులు ఆయా జిల్లా కేంద్రాలకు చేరుకున్నాయి. ఏలూరు జిల్లాకు సంబంధించి 17,830 నిఘంటువులు సమగ్రశిక్ష సీఎంఓ జే. రవీంద్ర సమక్షంలో దిగుమతి చేసుకుని ఏలూరులోని కేపీడీటీ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో భద్రపరిచారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి సమగ్ర శిక్ష సీఎంఓ అందే రామకోటేశ్వరరావు సమక్షంలో ఆ జిల్లాలోని 6వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడానికి 13, 270 నిఘంటువులు దిగుమతి చేసుకుని పాలకోడేరు మండలం శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భద్రపరిచారు.

దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించాలి

చింతలపూడి : వెయ్యి మంది జనాభా కలిగిన దళిత వాడలను ప్రత్యేక పంచాయతీలుగా ప్రకటించాలని ఎయిమ్ రాష్ట్ర కన్వీనర్ మాదిరి రాంబాబు విజ్ఞప్తి చేశారు. చింతలపూడి పట్టణం ఎయిమ్ వ్యవస్థాపకులు పీవీ సునీల్ కుమార్ గృహం వద్ద శనివారం దళిత పంచాయతీల సాధన రిస్ట్ బ్యాండ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి దళిత గ్రామానికి ఎయిమ్ నాయకులు వెళ్లి ప్రత్యేక పంచాయతీల ఆవశ్యకతను వివరించాలని చెప్పారు. దళిత వాడల అభివృద్ధి దళితుల చేతుల్లోనే ఉందని అన్నారు. గ్రామస్తులు అందరూ కలిసి కూర్చొని రోడ్లు, డ్రైయిన్లు ఇతర అభివృద్ధి పనులను చేసుకోవాలంటే ప్రత్యేక దళిత పంచాయతీల ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఇన్‌చార్జ్ పోడేటి రాంబాబు, సైనిక్ కన్వీనర్ విల్సన్, ఎయిమ్ నాయకులు పాతాళ గంగరాజు, రాజేంద్ర కుమార్, ఆనంద్, వాసు, కె.బుచ్చిబాబు, గొంది రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణపై సమావేశం

పెదపాడు : అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా మే 9 నుంచి 14 వరకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై శనివారం అభిప్రాయ సేకరణ నిమిత్తం సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చిన ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషిచేయాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో దేవాలయ కమిటీ చైర్మన్ నెర్సు నాగభూషణం, పెదపాడు మండల కన్వీనర్ అప్పన కనక దుర్గాప్రసాద్, దేవాలయ మాజీ చైర్మన్ నందిగం స్వామి, కొండేటి కనకారావు, దేవస్థానం కమిటీ సభ్యుడు చోడగిరి బిక్షాలు, అడుసుమిల్లి విజయలక్ష్మి, అప్పనవీడు ఎంపీటీసీ 2 బుద్దే రామసీత సీనియర్ జర్నలిస్టు తాడి రంగరావు, మందలపు సులోచన, అడుసుమిల్లి రాము, అడుసుమిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.